


# దురాశ

మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆరో తారీకు ఆ రోజు.

ఆరో తారీకంటే నా కమితభయం. కారణం ఆరో తారీకే నాకు నెలాఖరిరోజు అవుతుంది. ఫ్యాక్టరీచట్టం ప్రకారం ఏడో తారీఖు లోపల ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్లకు అన్ని జీతాలు చెల్లించాలి. ప్రతినెలా, ఏడో తారీఖే నాకు జీతం ముట్టేది.

అంటే ఆరోతారీఖు నాకు ముప్పై ఒకటవ తారీకన్నమాట. నాలుగు గంటలకో సిగరెట్ అన్నా లేకపోతే నాకు నిస్సత్తువగా, చిరాకుగా వుంటుంది. ఆఖరి సిగరెట్ తాగి నాలుగ్గంటలు దాటి పోయింది అప్పుడే.

జేబులో కేవలం అర్ధరూపాయ మాత్రమే మిగిలివుంది. సరిగ్గా బస్ చార్జీలకు సరిపోతుందంతే. తలనొప్పి ప్రారంభం అయింది నాకు.

బస్‌లో రద్దీగాలేదు, అదృష్టవశాత్తు. రాత్రి ఎనిమిదింపావయింది. డ్రయివర్, కండక్టర్ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంకా బస్ బయలుదేరే టైం అయినట్టులేదు. త్వరగా ఇంటికి చేరితే, ప్రక్కింటాయన దగ్గరనుంచి చుట్టముక్క సంపాదంచచ్చు అనే ఆలోచన కొద్దిగా రిలీఫ్‌గావుంది.

డిమ్‌గా వెలిగే బస్ దీపాల కాంతిలో జిగేల్‌మంటూ నా కళ్ళబడ్డది.

రూపాయిబిళ్ళ !

ఎదురుసీట్ కింద పొందికగా కూర్చొని వుంది, నీడ పడేచోట. నా మనసు చలించిందా క్షణంలో వంగి దాన్ని అందుకోవాలన్న ప్రయత్నాన్ని అతి కష్టంమీద నొక్కిపట్టాను.

మొదటిసారిగా నా ప్రక్కన మరొకతను కూర్చున్న సంగతి నా గ్రహింపులోకి వచ్చింది. నేను వంగి దాన్ని అందుకుంటే వాడు గమనిస్తాడు తప్పకుండా. అతను జేబులు తడుముకుని 'ఆరూపాయి నాదే మాస్టారు' అంటే ఇవ్వకుండా

వుండలేను. ఆ రూపాయి నిజానికి అతనిది అయినా, కాకపోయినా.

అతను ఎదుటి సీటులోని వ్యక్తిని తట్టి పిలిచి, "మీ రూపాయి బిళ్ల క్రిందే మయినా పడిందేమో చూడండి" అన్నా అనచ్చు, నాకు రూపాయి వస్తోందనే ఆసూయతో.

నా మనస్సు ఆలోచనలతో నిండిపోయింది. ఎలా ఆ రూపాయని సంపాదించడం? జేబురూమాల జారవేసి, వంగి రుమాలతో పాటుగా ఆ రూపాయిని అందుకుంటే?

ప్రక్కన కూర్చున్నతను చూసే ప్రమాదం వుంది. దురాశే అయినా, ఆ రూపాయని అంత తేలికగా వదులుకో దలుచుకోలేదు. బస్ అంతా ఖాళీగావుంటే, వాడు నా ప్రక్కనే వచ్చి కూర్చోవాలా?

నా ప్రక్కన కూర్చొనున్నతని చూపు ఏ క్షణంలోనయినా ఆ రూపాయబిళ్ల మీద పడచ్చు. పడితే, అతను తీసుకోవచ్చు. లేదా ఆ రూపాయబిళ్ళ పైభాగంలోని సీటు తాలూకు వ్యక్తిని అడగచ్చు మీదేనానని. నా చేతులు దాటిపోనివ్వ కూడదనుకున్నాను ఆ రూపాయబిళ్ళని, ఏది ఎలా అయినా సరే.

ఒకసారి మెరుపులాంటి ఆలోచనలు నా బుర్రకి తడుతూంటాయనిపిస్తూంటుంది నాకు. నాకు తట్టిన ఉపాయం మంచిదా, కాదా అని ఆలోచించాను కొన్ని క్షణాలు.

జేబులోంచి చిల్లర తీసాను ఒక పావలాబిళ్ల, రెండు పది పైసల బిళ్ళలు, ఒక అయిదు పైసలబిళ్ల, మొత్తం అర్థరూపాయి, ఆ నాలుగు నాణేలు కలసి. ఆ నెలాఖరున మిగిలిన డబ్బది.

గలగల చప్పుడయేలా, నా చేతిలోని చిల్లరని సీటుకిందకి జారవిడిచాను, పొరపాటున చెయ్యిజారి ఆ చిల్లర కిందపడ్డట్టుగా. ఎదుటి సీటులోని వ్యక్తి వెనక్కి తిరిగాడు, ఆ గలగల చప్పుడికి. నా ప్రక్కన కూర్చున్నతను నా వంక, ఎదురుగా సీటుకిందపడ్డ చిల్లరవంకా చూసాడు.

నేను వంగి, ఎదురుగా సీటుకిందపడ్డ చిల్లరనంతా ఏరాను. నా అర్థరూపాయతోపాటు, ముందరనుంచే పడివున్న ఆ రూపాయబిళ్ళనికూడా అందుకున్నాను నిర్భయంగా. నా ఆలోచనకి నాకే ఎంతో గర్వం వేసింది.

ఎవరికీ అనుమానం కలగకుండా రూపాయ సంపాదించగలిగాను. పెంపుడు పావురాళ్లు వెళ్ళి, స్వేచ్ఛగా తిరిగే పావురాయిని వెంటబెట్టి తీసుకువచ్చినట్లు, నా అర్థరూపాయి చిల్లరవెళ్ళి ఆ రూపాయని వెంటబెట్టి తీసుకువచ్చింది

నా చేతిలోని గాంధీబొమ్మ రూపాయిబిళ్ళవంక గర్వంగా చూసుకున్నాను. సిగరెట్స్ కొనుక్కోవచ్చు. రేపు సాయంత్రందాకా కాల్చడానికి సరిపడా.

ముందు సీటులో కూర్చొనున్న టెర్లిన్ పేంట్, టెర్లిన్‌షర్ట్ వ్యక్తి లేచి నిల్చుని,

ఓసారి నా వంక, గ్రీజ్ మరకలు అంటి వున్న నా కాకీరంగు బట్టలవంక అనుమానంగా చూసాడు.

వెంటనే తన జేబులు తడుముకుని అన్నాడు నావంక నిశితంగా చూస్తూ.

"నా జేబులో చిల్లరకూడా పడినట్లుంది."

తల అడ్డంగా వూపాను వెంటనే.

"గాంధీ రూపాయబిళ్ళ, ఓ పావలా. పాత పావలా అది. కావాలంటే చూడండి," మృదువుగా అన్నాడతను.

పొరపాటే చేసాను. నా గుప్పిట తెరచి, నా చేతిలోని చిల్లరని ఆ టెర్లిన్ షర్ట్ అతనికి చూపించాను అప్రయత్నంగా, తల మరోసారి అడ్డంగా వూపుతూ.

"నే చెప్పలా," అంటూ టెర్లిన్‌షర్ట్ వ్యక్తి నా అరచేతిలో వున్న చిల్లరలోంచి ఏరుతున్నట్లుగా రెండు నాణాలు—గాంధీ బొమ్మ రూపాయబిళ్ళ ఒకటి, పాత పావలాబిళ్ళ ఒకటి—తీసుకుని అన్నాడు. "నాదే ఈ చిల్లర. ఇందాక పూలు కొని రెండురూపాయల నోటు ఇస్తే, ఈ చిల్లర ఇచ్చాడు ఆ పూలకొట్లోని అతను."

ఎడం చేతిలోని పూలపొట్లంతో కిటికీలోంచి ఓ పూల దుకాణంవంక చూపించాడు అతను, కావాలంటే ఆ పూల దుకాణంవాడు సాక్ష్యం చెప్తాడనే సంగతి స్పష్టంగా ధ్వనించేలా.

"నాదే," తడబడ్డాను.

మెత్తగా నవ్వి అన్నాడు ఆ టెర్లిన్ షర్ట్ అతను

"నా జేబుకి చిల్లువుంది. కావాలంటే చూడు." కుడిచేతి వేలిని చొక్కా జేబులోకి పోనిచ్చి, జేబుకున్న చిల్లుని చూపించాడు.

బిత్తరపోతూ చూస్తూండిపోయాను నేను.

"థాంక్స్ ఎనీవే" అన్నాడతను ఆ డబ్బుని పేంట్‌జేబులో వేసుకుని, మళ్ళా తన సీట్‌లో కూర్చుంటూ.

నా చేతిలో మిగిలివున్న మూడు నాణాలవంక—రెండు పది పైసల బిళ్ళలు, ఓ అయిదు పైసలబిళ్ళ—పావలావంక చూసుకున్నాను.

ఆ పావలాతో ఇంటికి బస్ టిక్కెట్ కొంటే, చలిలో రేపు ఉదయం నడిచి వెళ్లాలి ఫేక్టరీకి. ఉదయం షిఫ్ట్‌కి. ఇక బస్ ఛార్జీ లేదు.

ఓడిపోయాను. అందుకే కిక్కురుమనలేదు నేను. ఒక్కోసారి పెంపుడు పావురాళ్ళు, స్వేచ్ఛగా తిరిగే పావురాళ్ళతో ఎగిరిపోతూ ఉంటాయి శాశ్వతంగా—అదృష్టం బావుండనప్పుడు.

